క్లుప్తంగా

బాలంపేటలో 'రైతు నేస్తం'



ప్రొజెక్టర్ ద్వారా సమాచారం వింటున్న రైతులు

దౌల్తాబాద్: మండలంలోని బాలంపేట క్లస్టర్ రైతువేదికలో మంగళవారం రైతునేస్తం కార్యక్రమం ప్రారంభమైంది. ప్రభుత్వం ప్రతి మంగళవారం రైతువేదికల్లో అన్నదాతలకు వ్యవసాయానికి సంబంధించిన సలహాలు, సూచనలు వేగంగా అందించాలనే ఉద్దేశంతో బాలంపేట రైతువేదికలో ప్రొజెక్టర్ ద్వారా రైతులకు చెప్పారు. పంటలు వేసుకునే సమయం నుంచి రైతుల చేతికందే వరకు తీసుకునే జాగ్రత్తలపై రాష్ట్రస్థాయి అధికారులు వివరించారు. కార్యక్రమంలో ఏఈఓలు నిఖిల్, వైష్ణవి, పరిమళ తదితరులున్నారు.

ఉచిత వైద్య శిబిరం విజయవంతం



క్యాంపు ప్రారంభిస్తున్న లయన్స్ క్లబ్ సభ్యులు

కొడంగల్ : హైదరాబాద్‌కు చెందిన పద్మజ ఆస్పత్రి, కొడంగల్ లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో మంగళవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. పట్టణంలోని రాఘవేంద్ర ఆస్పత్రిలో ఉ. 10 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు కీళ్ల నొప్పులు, మోకాళ్ల నొప్పులు, మెడనొప్పి, నడుం నొప్పి, మెన్ను నొప్పి, పుట్టుకతో వచ్చే అంగవైకల్యం, విరిగిన ఎముకలు, వంకరగా అతికిన ఎముకల రోగులకు పరీక్షించారు. డాక్టర్ కొమిశెట్టి ముధురిమ నాయుడు, డాక్టర్ రవీంద్రయాదవ్, డాక్టర్ శ్రీలతాయాదవ్ పరీక్షలు నిర్వహించారు. ఆరోగ్య సమస్యలు ఉన్నవారికి మందులు ఇచ్చారు. కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు మురహరి వశిష్ట, ఎస్ఆర్ఐ శ్రీహరి వశిష్ట, సభ్యులు దాసప్ప యాదవ్, జయతీర్థాచారీ, శ్రీనివాస్‌గౌడ్, మునీర్, భీంరాజు, దామోదర్‌రెడ్డి పాల్గొన్నారు.

దివ్యాంగుల సమస్యలను పరిష్కరించాలి



సంఘం సమావేశంలో మండల అధ్యక్షుడు చంద్రయ్య

పరిగి: దివ్యాంగుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని ఆ సంఘం మండల అధ్యక్షుడు చంద్రయ్య కోరారు. మంగళవారం పట్టణ కేంద్రంలో ఆయా మండలాల వికలాంగుల సంఘం అధ్యక్షుడు, కార్యదర్శులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ సంక్షేమ పథకాలు దివ్యాంగులకు ప్రత్యేకంగా కేటాయించాలని అన్నారు. ఎన్నికల హామీ ప్రకారం రూ.6వేల పెన్షన్ ఇవ్వాలన్నారు. నిరుద్యోగ దివ్యాంగులకు ప్రభుత్వం ఉపాధి కల్పించాలని తెలిపారు. కార్యక్రమంలో ఆయా మండలాల అధ్యక్షులు చుక్కయ్య, లక్ష్మి, లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.

పొంచి ఉన్న ప్రమాదం



ప్రమాదకరంగా ఉన్న మురుగు కాలువ

దుద్యాల్ : మండలంలోని చిలుముల మైల్వార్ గ్రామం నుంచి మామిడికుంట ఆంజనేయ స్వామి దేవాలయానికి వెళ్లే దారిని ఆనుకుని ఉన్న మురుగుకాలువ ప్రమాదభరితంగా ఉందని పలువురు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. స్వామివారిని దర్శించుకునేందుకు బైకులు, ఆటోలు, కార్లపై భక్తులు రాకపోకలు సాగిస్తుంటారు. రోడ్డుకు ఆనుకుని ఉండడంతో వాహనాలు అదుపుతప్పి కాలువలో పడే ప్రమాదం ఉంది. ఈ మార్గం నుంచి దేవాలయానికి చాలా దూర ప్రాంతాల నుంచి రాత్రనక పగలనక వస్తుంటారు. రాత్రి వేళల్లో మురుగు కాలువ కనిపించకపోవడంతో, గతంలో చాలా వాహనాలు అదుపుతప్పి మురుగు కాలువలో పడిన సంఘటనలు ఉన్నాయని గ్రామస్తులు తెలిపారు. అధికారులు స్పందించి మురుగు కాలువ వైపు ఇనుప కంచె ఏర్పాటు చేసి ప్రమాదాలు జరగకుండా చూడాలని గ్రామస్తులు కోరుతున్నారు.

బీటీ రోడ్డు కల తీరేనా!

- అధ్వానంగా అడాల్‌పూర్, పటేల్‌చింత తండా రోడ్లు
- రాకపోకలకు ఇబ్బందులు పడుతున్న గ్రామస్తులు



కంకర తేలి ప్రమాదకరంగా మారిన అడాల్‌పూర్ రోడ్డు



కోతకు గురైన పటేల్‌చింతతండా రోడ్డు

యాలాల: మండల పరిధిలోని అడాల్‌పూర్, పటేల్‌చింత తండాలకు వెళ్లే రోడ్లు అధ్వానంగా మారాయి. దీంతో గ్రామం నుంచి పట్టణానికి వెళ్లేందుకు గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ సమస్య వర్షాకాలంలో మరింత వేధిస్తుందని వాపోతున్నారు. ప్రతి నిత్యం తాండూరుకు రాకపోకలు సాగించే విద్యార్థులు, వ్యాపారులు, రైతులు కంకర తేలిన రోడ్లు, కోతకు గురైన ఇరుకు రోడ్లపై వాహనదారులు నానా అవస్థలు పడుతున్నారు. అడాల్‌పూర్ గ్రామానికి వెళ్లేందుకు తాండూరు మండలం బిజ్వారం గ్రామ శివారు నుంచి సుమారు 4 కిలోమీటర్ల దారి ఉంది. ఈ దారి కంకరతేలి, వర్షం పడినప్పుడల్లా గుంతల్లో నీరు నిలిచి బురదమయంగా మారుతుంది. దీంతో ఈ మార్గంలో ప్రయాణించే అడాల్‌పూర్ వాసులు తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నారు. మెటల్‌రోడ్డును బీటీ రోడ్డుగా మార్చాలని గతంలో ప్రజాప్రతినిధులు, అధికారులకు విన్నవించినా రోడ్డు పట్టించుకోవడం లేదని వారు వాపోతున్నారు. మరోవైపు రేళ్లగడ్డతండా అనుబంధ గ్రామమైన పటేల్‌చింత రోడ్డు సైతం దారుణంగా ఉంది. ప్రధాన రోడ్డు నుంచి తండాలోకి వెళ్లేందుకు 5 కిలోమీటర్ల దూరం ఉంది. మధ్యలో అన్నారం వాగు ప్రవహిస్తుంది. గుట్టలు, అటవీ మధ్యలో నుంచి ఉన్న మెటల్‌రోడ్డు పరిస్థితి చాలా దారుణంగా ఉందని తండావాసులు చెబుతున్నారు. వర్షాకాలంలో ఈ సమస్య మరింత ఎక్కువగా ఉంటుందని తెలిపారు. ఈ విషయంలో అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి బీటీ రోడ్డు మంజూరు చేయాలని కోరుతున్నారు.

జారి పడుతున్నారు..



బిజ్వారం నుంచి అడాల్‌పూర్ వరకు కంకరతేలి, గుంతలమయమైన రోడ్డుతో తరుచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. ఇటీవల కాలంలో పడిన వర్షం కారణంగా ద్విచక్రవాహనదారులు జారి పడుతున్నారు. రోడ్డుపై గుంతల్లో నిలిచిన నీటి కారణంగా తరుచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. అధికారులు, ప్రజాప్రతినిధులు దృష్టి సారించి మా ఊరికి బీటీ రోడ్డు మంజూరు చేయించండి.

– శేఖర్, యువకుడు, అడాల్‌పూర్

నానో డీఏపీ, యూరియాతో లబ్ధి



నానో యూరియా, డీఏపీ

మోమిన్‌పేట: కేంద్ర ప్రభుత్వం గుళికల రూపంలో ఉన్న యూరియా, డీఏపీలకు బదులుగా ద్రవరూపంలో నానో యూరియా, డీఏపీలను తయారు చేస్తుంది. దీని వల్ల రైతుకు రవాణా, దూరభారం, ధర తగ్గుతుంది. అరలీటరు నానో యూరియా, డీఏపీ ఒక బస్తాతో సమానం. పత్తి, కూరగాయల సాగుకు పైపాటుగా పిచికారీ చేయాలి. దుకాణం నుంచి తీసుకురావడం, పొలానికి తీసుకుపోవడం నానో యూరియా, డీఏపీ చాలా సులువు. బస్తా తీసుకెళ్లడం వలన రైతుకు భారం అవుతుంది. ఒక బస్తా గుళికల యూరియా ఎకరా పొలంలో వాడటం వలన 60శాతం మాత్రమే మొక్క స్వీకరిస్తుంది. మిగతా 40శాతం గాలిలో కలిసి వాయుకాలుష్యం ఏర్పడుతుందని మండల వ్యవసాయాధికారి జయశంకర్ ఈ సందర్భంగా తెలియజేశారు. డీఏపీ కూడా దుక్కిలో వేయాల్సి ఉన్న పైపాటుగా వేయడం వలన నష్టమే కానీ, మొక్కకు ఎలాంటి ఫలితం దక్కదని తెలిపారు. రైతులు నానో యూరియా, డీఏపీలను నేరుగా కాని ఎదైన పురుగు మందులో కలిపి పత్తిపై పిచికారీ చేయాలన్నారు. పిచికారీ చేయడంతో నేరుగా ఆకులు ద్వారా మొక్క వందశాతం గ్రహిస్తుందని చెప్పారు. దీంతో వాలు కాలుష్యం కూడా ఉండదన్నారు. రసాయనిక ఎరువులు నేరుగా భూమిలో వేయడం వల్ల భూ సాంద్రత తగ్గుతుందని వివరించారు. వర్షాభావ పరిస్థితిలో, అధిక వర్షపాతంలోనూ నానో యూరియాను పంటపై పిచికారీ చేయవచ్చని తెలిపారు. దీంతో పంట ఎదుగుదల ఎక్కడ ఆగదన్నారు. ప్రస్తుతం కేంద్ర ప్రభుత్వం డీఏపీని కూడా ద్రవరూపంలో తయారు చేస్తుందని చెప్పారు. రైతులు సేంద్రియ ఎరువులను భూమిలో వేసి కలియ దున్నుకొని నానో ఎరువులను పంటలపై పిచికారీ చేయాలని సూచించారు.

అవగాహన కల్పిస్తున్నాం..



నానో ఎరువులపై రైతులకు అవగాహన కల్పిస్తున్నాం. చాలా మందికి రైతులకు నానో యూరియా, డీఏపీ ఉందన్నా విషయం తెలియదు. ప్రతి ఫర్టిలైజరు దుకాణాలలో విరివిగా నానో యూరియా, డీఏపీలను అందుబాటులో ఉంచాలి. రానురాను రోజుల్లో అన్ని రసాయనిక ఎరువులు ద్రవరూపంలో వస్తాయి.

– మండల వ్యవసాయాధికారి జయశంకర్

చెరువులు, కుంటలకు జలకళ



మంబాపూర్ చెరువుకు పూర్తిస్థాయిలో చేరిన నీరు



ప్రవహిస్తున్న గాజీపూర్ వాగు

పెద్దేముల్: మండలంలోని చెరువులు, కుంటలకు జలకళ సంతరించుకుంది. గత నాలుగు రోజుల నుంచి కురుస్తున్న వర్షాలకు వాగులు, చెరువుల్లో పెద్ద ఎత్తున చేరింది. మండలంలోని 37 గ్రామ పంచాయతీల్లో సుమారు 40పైగా చెరువులు, కుంటలు ఉన్నాయి. గాజీపూర్, కందనెల్లి, ఇందూరు వాగుల్లో కొత్త నీరు ప్రవహిస్తుంది. వర్షాలకు వ్యవసాయ పొలాల్లో కలుపు పనులు, అరక పనులు నిలిచిపోయాయి. ఇప్పటికే చెరువులు, కుంటల కింద ఉన్న రైతులు వరిపంట సాగుకు కరిగేట్లు కూడా ప్రారంభం చేశారు. మండలంలో సుమారు మూడు వేల ఎకరాలకు పైగా వరి సాగవుతుందని వ్యవసాయ అధికారుల చెబుతున్నారు.

జీపీలకు నిధులు కేటాయించాలి



స్పీకర్‌కు సమస్యలు వివరించిన నాయకులు

ధారూరు: మండలంలోని 32 గ్రామ పంచాయతీల్లో నిధులు లేక అభివృద్ధి కుంటుపడిందని, కావునా, నిధులు కేటాయించాలని కాంగ్రెస్ నాయకులు మంగళవారం శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్‌ను హైదరాబాద్‌లోని మినిస్టర్స్ క్వార్టర్స్‌లో కలిసి విన్నవించారు. గ్రామాలు, తండాల్లో పలు సమస్యలు తిష్టవేశాయని పేర్కొన్నారు. మండలాన్ని ఆదర్శ మండలంగా తీర్చిదిద్దాలని వారు స్పీకర్‌కు విజ్ఞప్తి చేశారు. స్పీకర్‌ను కలిసిన వారిలో జిల్లా వాలీబాల్ అసోసియేషన్ అధ్యక్షుడు హన్మంత్‌రెడ్డి, మాజీ జెడ్పీటీసీ రాములు, ఎబ్బనూర్ గ్రామ మాజీ సర్పంచ్ రాజేందర్‌రెడ్డి, కాంగ్రెస్ నాయకులు నాగారం రాజేందర్‌రెడ్డి, రామకృష్ణారెడ్డి, సుకుమార్, లక్ష్మన్, వీరేందర్‌రెడ్డి ఉన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేత

బంట్వారం: కోట్‌పల్లి మండలంలోని ఎన్నారం గ్రామానికి చెందిన రిజ్వానా బేగం కుటుంబానికి రూ.18, 500 సీఎంఆర్ఎఫ్ చెక్కును కాంగ్రెస్ నాయకులు మంగళవారం అందజేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ కోట్‌పల్లి మండల అధ్యక్షుడు నర్సింగ్‌నాయక్, ఎఎంసీ డైరెక్టర్ శ్రీనివాస్, నాయకులు వెంకట్‌రాంరెడ్డి, నర్సింహరెడ్డి, అంజయ్య పాల్గొన్నారు.

ధారూరు ఫారెస్టుకు నలుగురు బీట్ ఆఫీసర్లు

ధారూరు: ధారూరు ఫారెస్టు రేంజ్‌కు నలుగురు బీట్ ఆఫీసర్లు బదిలీపై వచ్చారు. ధారూరు ఫారెస్టు బీట్‌కు వీరబాబు రాగా, అంతకుముందు పని చేసిన బీట్ ఆఫీసర్ నరేష్ పరిగి ఫారెస్టు రేంజ్‌లోని అనంతసాగర్‌కు బదిలీ అయ్యారు. రాస్నం బీట్‌కు రేణుక రాగా, ఇక్కడి బీట్ ఆఫీసర్ ఆనంద్ కొడంగల్ రేంజ్‌లోని కొత్తూరుకు వెళ్లారు. రుద్రారం బీట్‌కు మధుకర్‌రెడ్డి రాగా, ఇక్కడి బీట్ ఆఫీసర్ రతన్ వికారాబాద్ రేంజ్‌లోని అనంతగిరి గుట్టకు వెళ్లారు. ఖాళీగా ఉన్న జుంటుపల్లి బీట్‌కు కాశయ్య బీట్ ఆఫీసర్‌గా బాధ్యతలు చేపట్టారు. ధారూరు ఫారెస్టు రేంజ్ పరిధిలో ఇంకా 8 మంది బీట్ ఆఫీసర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ధారూరు ఫారెస్టు రేంజ్ ఆఫీసర్ పోస్టు సంవత్సరాలుగా ఖాళీగా ఉండగా ఇన్‌చార్జిలతోనే కొనసాగిస్తున్నారు.

కాంగ్రెస్ నేత ఎండీ ఆజం మృతి



ఆజం (ఫైల్)

మోమిన్‌పేట: మండల కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షుడు ఎండీ ఆజం (80) మంగళవారం ఉదయం గుండెపోటుతో మృతి చెందాడు. ఉ.4గంటలకు నిద్ర లేచి నమాజ్ చదివేందుకు తయారు అవుతున్న సమయంలో ఛాతీలో నొప్పి వచ్చింది. వెంటనే ఆస్పత్రికి తీసుకువెళ్లే క్రమంలో మృతి చెందాడు. మండల పరిధిలోని ఆయా పార్టీలకు చెందిన నాయకులు మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. ఆయన పార్టీకి ఎంతో సేవ చేశాడని కొనియాడారు. అనంతరం వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు.

పరిసరాల పరిశుభ్రతతో ఆరోగ్యం



పారిశుద్ధ్య పనులు చేయిస్తున్న కమిషనర్

కొడంగల్ : పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడంతో ఆరోగ్యంగా ఉంటారని మున్సిపల్ కమిషనర్ బలరాంనాయక్ పేర్కొన్నారు. మంగళవారం పట్టణంలోని పలు కాలనీల్లో ఆయన పర్యటించి, మున్సిపల్ కార్మికులతో పారిశుద్ధ్య పనులు చేయించారు. కాలనీవాసులు అంటువ్యాధులు రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

పిచ్చి మొక్కల తొలగింపు



తొలగించక ముందు



తొలగించిన తర్వాత

సాక్షి ఎఫెక్ట్..

నవాబుపేట: మండల పరిధిలోని గొల్లగూడ గ్రామానికి విద్యుత్ సరఫరా అయ్యే ట్రాన్స్‌ఫార్మర్‌ను పిచ్చి మొక్కలు, చెట్ల పొదలు కమ్మేయడంతో ట్రాన్స్‌ఫార్మర్, పక్కన ఉన్న స్తంభం పూర్తిగా కనిపించకుండా పోయింది. దీంతో విద్యుత్ సరఫరాకు తీవ్ర అంతరాయం ఏర్పడంతో పాటు, ఎప్పుడు ఏ ప్రమాదం సంభవిస్తుందోనని గ్రామస్తులు భయాందోళన చెందుతున్న విషయాన్ని ఇటీవల సాక్షిలో 'గాలి వీస్తే అంధకారమే' అనే శీర్షికతో ప్రచురించింది. స్పందించిన విద్యుత్ అధికారులు, సిబ్బంది ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ ఉన్న పిచ్చి మొక్కలను తొలగించారు. కానీ పూర్తిస్థాయిలో తొలిగించలేదు. పూర్తిగా పిచ్చి మొక్కలు తొలగించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

పొంచి ఉన్న రోగాల ముప్పు

- అస్తవ్యస్తంగా పారిశుద్ధ్యం
- పట్టణాల్లో ఎక్కడబడితే అక్కడ చెత్త పారబోత



మురుగుమయంగా వేంకటేశ్వర టెంపుల్ కాలనీ రోడ్డు

వికారాబాద్ : పట్టణాల్లో పారిశుద్ధ్యం అస్తవ్యస్తంగా తయారయ్యింది. దీనికి తోడు వరుసగా కురుస్తున్న వానలతో వర్షపునీరు, డ్రైనేజీ కలగలిపి రోడ్లపైనే ప్రవహిస్తుండటంతో జనం రోడ్లపై కాలుపెట్టి నడవలేకపోతున్నారు. కాలనీల్లో ఇళ్ల మధ్య రోడ్లపైన మురుగు పేరుకుపోతున్నా మున్సిపల్ అధికారులు పట్టించుకోవడం లేదు. దీంతో రోగాల బారిన పడాల్సి వస్తుందని ప్రజలు ఆందోళనకు గురవుతున్నారు.

పెరుగుతున్న పారిశుద్ధ్య సమస్య

పట్టణాల్లో పారిశుద్ధ్య సమస్య రోజురోజుకు అధికమవుతూనే ఉంది. పల్లెల్లో పారిశుద్ధ్య నిర్వహణ కొంత మెరుగుపడగా పట్టణాల్లో మాత్రం అధ్వానంగానే కనిపిస్తుంది. చాలా వరకు చెత్తను సేకరించకుండా ఎక్కడ పడితే అక్కడ వదిలేస్తుండగా సేకరించిన చెత్తను సైతం ఇష్టారాజ్యంగా పట్టణ శివారు ప్రాంతాల్లో డంపింగ్ చేస్తున్నారు. దీంతో చెత్త కుళ్లిపోయి దుర్గంధం వ్యాపిస్తుంది. దోమలు, ఈగలు పెరిగి పరిసర ప్రాంత ప్రజలకు నిద్రలేకుండా చేస్తున్నాయి. ఇక రోజు ఉదయం లేవగానే తడిపొడి చెత్త వేర్వేరుగా వేయండని మున్సిపాలిటీ వాహనాలతో ఊదరగొడుతున్న యంత్రాంగం ఆ దిశగా చర్యలు కనిపించడంలేదు. నిధుల దుర్వినియోగం చేయటం.. లేదంటే ఒకరిపై ఒకరు దుమ్మెత్తిపోసుకోవటానికే పాలక వర్గం పరిమితమయిందని ఆరోపణలు వినిపిస్తున్నాయి.

ఇళ్ల మధ్య పేరుకుపోతున్న మురుగు

పురపాలక సంఘాల పరిధిలోని చాలా కాలనీలు దుర్గంధంతో నిండిపోయాయి. నివాసాల మధ్య మురుగు పేరుకుపోయి పందులు దోమలకు ఆవాసాలుగా మారుతున్నాయి. ప్రజాప్రతినిధులు అధికారులు చూసిచూడనట్లు వ్యవహరిస్తున్నారే తప్ప పరిష్కారానికి చర్యలు చేపట్టడంలేదు. ఒక్కో మున్సిపాలిటీలో రూ. కోట్లలో నిధులు ఖర్చు చేశామని చెబుతున్నా.. సమస్యలు మాత్రం అలాగే దర్శనమిస్తున్నాయి.

మంచి సమాజాన్ని తయారు చేయండి



ఉపాధ్యాయులను సన్మానిస్తున్న ఎంఈఓ

మండల విద్యాధికారి హరిశ్చందర్

పరిగి: ఉపాధ్యాయుల చేతుల్లోనే సమాజ నిర్మాణం ఉంటుందని మండల విద్యాధికారి హరిశ్చందర్ అన్నారు. మండల పరిధిలోని మిట్టకోడూర్ ఉన్నత పాఠశాలలో విధులు నిర్వహించి బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులకు మంగళవారం వీడ్కోలు సమావేశం నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. దేశ భవిష్యత్తు యువత చేతుల్లో ఉందని, యువతను తీర్చిదిద్దేది ఒక ఉపాధ్యాయుడి వల్లే సాధ్యమవుతుందన్నారు. కావునా, ఉపాధ్యాయులు విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలని సూచించారు. మంచి విద్య, మంచి విధులు నిర్వహించిన వారికి సమాజంలో గుర్తింపు లభిస్తుందని తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు శ్రీనివాస్ పాల్గొన్నారు.

సైబర్ మోసాలపై అప్రమత్తత



మహిళలకు అవగాహన కల్పిస్తున్న సతీష్

కుల్కచర్ల: సైబర్ మోసాలపై మహిళలు అప్రమత్తంగా ఉండాలని తెలంగాణ గ్రామీణ బ్యాంక్ మేనేజర్ సతీష్ అన్నారు. మంగళవారం స్థానిక సీఎస్పీ కేంద్రంలో మహిళలకు ఆర్థిక అక్షరాస్యత, సైబర్ మోసాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రస్తుతం వాట్సాప్ గ్రూపుల్లో వివిధ పేర్లతో మోసపూరితమైన లింకులు వస్తున్నాయని వాటిని ఓపెన్ చేయొద్దని సూచించారు. ఫోన్లలో గుర్తుతెలియని వ్యక్తులు లోన్లు ఇస్తామని చెప్పే మాటలు నమ్మొద్దని పేర్కొన్నారు. కార్యక్రమంలో సీఎస్పీ కేంద్రం నిర్వాహకురాలు స్వేత, వీఓఏ మహేశ్వరి, మహిళా సంఘం సభ్యులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

• ఆటపాటలతో విద్య

దౌల్తాబాద్: అంగన్‌వాడీ కేంద్రాల్లో ఇక నుంచి ఆటపాటలతో బోధన జరుగుతుందని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ మంజుల పేర్కొన్నారు. మండలంలోని బాలంపేట, చల్లాపూర్, ఈర్లపల్లి, సుల్తాన్‌పూర్ గ్రామాల్లో మంగళవారం నిర్వహించిన అమ్మ ఆట-అంగన్‌వాడీ బాట కార్యక్రమం నిర్వహించారు. మూడేళ్ల దాటిన పిల్లలను అంగన్‌వాడీ కేంద్రాల్లో చేర్పించాలని కోరారు.

• గ్రామాల్లో ఏబీ స్విచ్ ఏర్పాటు చేయాలి

పెద్దేముల్: గ్రామాల్లో ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద ఆన్‌ఆఫ్ ఏబీ స్విచ్‌లు ఏర్పాటు చేయాలని మండలంలోని ఆయా గ్రామాల రైతులు విద్యుత్ ఏడి ఆదినారాయణను కలిసి విన్నవించారు. ముఖ్యంగా గ్రామాల్లో ఏబీ స్విచ్‌లు లేక కరెంటు షాక్‌లతో రైతులు, మూగ జీవాలు చనిపోతున్నాయని గుర్తుచేశారు. ప్రమాదం జరిగిన సమయాల్లో సంబంధిత అధికారులకు ఫోన్ చేసిన స్పందించక ప్రాణాలు పోతున్నాయని అన్నారు. గ్రామ పంచాయతీలతో పాటు అనుబంధ గ్రామాల్లో ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద ఏబీ ఏర్పాటు చేయాలని కోరారు. దీనికి సానుకూలంగా స్పందించిన ఏడీ ఆదినారాయణ, ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి న్యాయం జరిగేలా చుస్తానన్నారు.

• నిరుద్యోగులకు న్యాయం

కొడంగల్ : ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి హయాంలోనే నిరుద్యోగులకు న్యాయం జరుగుతుందని యువజన కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కృష్ణంరాజు, ఓయూ జేఏసీ నాయకుడు రెడ్డి శ్రీనివాస్ అన్నారు. మంగళవారం పట్టణంలోని సీఎం నివాసంలో విలేకరులతో మాట్లాడుతూ.. బీఆర్ఎస్ అధికారంలో ఉన్న పదేళ్ల ఉద్యోగాలను భర్తీ చేయలేదన్నారు. నిరుద్యోగులకు అన్యాయం చేశారని విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత సీఎం రేవంత్‌రెడ్డి ఉద్యోగాలను భర్తీ చేస్తున్నారని అన్నారు. కోచింగ్ సెంటర్ల మాఫియాతో కలిసి బీఆర్ఎస్‌వీ విభాగం కార్యకర్తలు ఆందోళన చేస్తున్నారని ఆరోపించారు.

• వన మహోత్సవం విజయవంతం చేయండి

కుల్కచర్ల: వన మహోత్సవం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కుల్కచర్ల ఎంపీడీఓ రామకృష్ణ నాయక్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ... ప్రస్తుతం వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో నాటిన మొక్కలు ఆరోగ్యకరంగా పెరిగే అవకాశం ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఎంపీఓ ఖరీం, ఏపీఓ శోభ స్థానిక సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

• భక్తిశ్రద్ధలతో మొహర్రం

పెద్దేముల్: మండలంలోని పలు గ్రామాల్లో మంగళవారం మొహర్రం పండుగను హిందూ, ముస్లిం కులాలకు అతీతంగా జరుపుకొన్నారు. మూడు రోజుల పాటు ప్రధాన కూడల్లో నిలబెట్టిన పీర్ల చుట్టూ అలయ్, బలయ్ ఆడుతూ.. పాటలు పాడారు. బుధవారం సాయంత్రానికి పీర్లను బావిలో వేస్తామని పెద్దలు తెలియచేశారు.

• నూతన బోరు ప్రారంభం

కుల్కచర్ల: ప్రభుత్వ మోడల్ స్కూల్ వసతిగృహంలో విద్యార్థులకు తాగునీటి సమస్యను పరిష్కరించేందుకు ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి చేసిన అభినందనీయమని మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఆంజనేయులు, ప్రిన్సిపాల్ భాగ్యలక్ష్మి అన్నారు. మోడల్ స్కూల్‌లో వేసిన నూతన బోరును మంగళవారం ప్రారంభించారు. వారు మాట్లాడుతూ.. విద్యాభివృద్ధికి ఎమ్మెల్యేకు ఉన్న చిత్తశుద్ధి మరోమారు ప్రజలకు తెలిసిందన్నారు.